క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: డివిజన్ పరిధిలోని అచ్చంపేట, లింగాల, బల్మూర్, ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని అన్ని 33/11 సబ్‌స్టేషన్లకు శనివారం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి నుంచి అచ్చంపేటకు 132 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

‘చలో ఢిల్లీ’ పోస్టర్ విడుదల

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం చలో ఢిల్లీ పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 10 కోట్ల మందికి పైగా కార్మికులు నిర్మాణరంగంలో పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టం తీసుకురావాలని డిమాండ్ తో ఈనెల 28న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు పులిజాల పరశురాములు, నేరటి రాజు, రామచంద్రయ్య, హమీద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన 22 మంది అథ్లెటిక్ క్రీడాకారులకు శుక్రవారం క్రీడా దుస్తులను ఎస్ఐ మాధవరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించి కల్వకుర్తి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ నెల 9న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వకుర్తి పట్టణంలో జరిగిన సెలక్షన్ లో 20 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వాములు పేర్కొన్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న కొల్లూరులోని గార్డియం పాఠశాల ఆవరణలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్, విజేందర్ యాదవ్, స్వాములు, లావణ్య రెడ్డి, లక్ష్మి, బిక్షపతి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఉస్మానియా విశ్వవిద్యాలంలో ఆంక్షలు ఎత్తేయాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజా పోరాటాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఓయూ విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ అని అన్నారు. ఆంక్షలపై విడుదల చేసిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల బండ శాయిబాబు, అభిషేక్, చందు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాట యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రధాన వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ మాట్లాడుతూ భారతదేశ విముక్తి కోసం చిన్నవయసులోనే ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. దేశ విచ్ఛిన్నం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నాయకులు వర్ధం సైదులు, శివ వర్మ, తారాసింగ్, శంకరవరప్రసాద్, మధు, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పనులను అడ్డుకున్న గ్రామస్తులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెంలో సెల్‌టవర్ నిర్మాణ పనులను శుక్రవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. జేసీబీ వాహనాలను గ్రామస్తులు అడ్డుకుని టవర్ నిర్మాణ పనులను నిలిపివేశారు. స్థానిక అధికారులు టవర్ నిర్మాణం కోసం పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని అనుమతులు ఇచ్చారని వారు ఆరోపించారు.

డాక్టర్ ప్రతాప్ కౌటిల్యకు సన్మానం

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంతకము పుస్తక రచయిత డా. ప్రతాప్ కౌటిల్యను తెలంగాణ రాష్ట్ర మల్టీ జోనల్ ఉన్నత విద్యా జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ శుక్రవారం తన కార్యాలయంలో సన్మానించారు. సాహిత్య మరియు విద్యా విభాగంలో విశిష్ట కృషి చేసిన ప్రతాప్ కౌటిల్యకు లింగేశ్వర స్ఫూర్తి ప్రతిభా పురస్కారం, ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారాన్ని డా. ప్రతాప్ కౌటిల్య అందుకున్నారన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ కౌటిల్యకు జ్ఞాపికతో పాటు మెమొంటో ఇచ్చి సత్కరించారు.



తెలకపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



తెలకపల్లిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



పెద్దకొత్తపల్లిలో ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న విద్యార్థులు

ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



చారకొండలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మొదటిరోజు శుక్రవారం ప్రశాంతంగా నిర్వహించారు. అధికారులు విద్యార్థులకు కనీస వసతులు కల్పించారు.

■ కొల్లాపూర్ మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. మొత్తం 718 మంది విద్యార్థులకు 716 మంది హాజరయ్యారు. –
కోడేరు మండలంలో 350మంది విద్యార్థులకు గాను ఇద్దరు పరీక్షకు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరిండెంట్ సుధారాణి, కుర్మయ్య తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఎస్ఐ గోకారి పర్యవేక్షించారు.

■ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1581 మంది విద్యార్థులకు 5 మంది గైర్హజరయ్యారు. –

■ ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో మన్ననూర్, అమ్రాబాద్, పదర, దోమలపెంటలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో 545 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 268 మంది విద్యార్థులు హాజరయ్యారు.

■ తెలకపల్లిలో మొత్తం 873 మంది విద్యార్థులకు గాను 872 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

■ చారకొండలో 177 విద్యార్థులకు అందరు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

■ ఉప్పునుంతలలో మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మారావు తెలిపారు.

■ తాడూరు: మండల కేంద్రంతో పాటు శిర్సవాడ పరీక్ష కేంద్రాలలో మొదటి రోజు 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాయి.

■ పెంట్లవెల్లి, జటప్రోల్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జటప్రోల్ సెంటర్‌లో 72 మంది, పెంట్లవెల్లిలో 92 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోలీసులు గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.



పెంట్లవెల్లిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

■ వెల్దండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్‌హైస్కూల్‌లో విద్యార్థులను ఉపాధ్యాయులు తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలకు పంపించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించారు. జిరాక్స్ కేంద్రాలను మూసివేయించారు.

■ బల్మూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు కనిపించలేదు. జిరాక్స్ సెంటర్లు, దుకాణాలు యథేచ్ఛగా కొనసాగాయి.

■ లింగాల మండల కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 296 మంది విద్యార్థులకు గాను 294 మంది హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

■ బిజినేపల్లి మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 4 పరీక్షా కేంద్రాలలో 732 మంది విద్యార్థులకు గాను 731 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

■ పెద్దకొత్తపల్లి ఏ సెంటర్ ఉన్నత పాఠశాల 100 మంది, బీ సెంటర్ ప్రాథమిక పాఠశాలలో 100 మంది, మోడల్ స్కూల్ 172 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షల అనంతరం విద్యార్థులు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలలో తరలివెళ్లారు.



మన్ననూర్‌లోని పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



లింగాల ఉన్నత పాఠశాలలో



జటప్రోల్ పరీక్ష కేంద్రంలో పోలీసు భద్రత

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పునుంతల: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో రెండు వారాల పాటు గ్రామాల్లో ప్రజలను కలిసి వారి సమస్యలపై అధ్యయనం చేశామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలన్నారు. అర్హులకు రేషన్‌కార్డులు వెంటనే మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా, వీధిలైట్ల సమస్యలు పేరుకుపోయాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం వెంటనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉస్సేన్, కిష్టయ్య, సైదులు, ప్రశాంత్, మొగులాలు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత



నాగర్‌కర్నూల్ క్రైం: ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఇన్సూరెన్స్ నగదును అందజేసినట్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మృతిచెందిన 2009 బ్యాచ్‌కు చెందిన రామస్వామి కుటుంబానికి రూ. కోటి నగదు ఇన్సూరెన్స్ చెక్కును అతని భార్య సత్యవతికి, 2013 బ్యాచ్‌కు చెందిన పాత్లావత్ శ్రీను నాయక్ కుటుంబానికి రూ. 75 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అతని భార్య చంద్రకళకు అందజేసినట్లు తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సునీత, ఎస్‌బీఐ మేనేజర్ మధుసూదన్, ఏఎస్పీ రామేశ్వర్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల నిరసన



వెల్దండలో నిరసన తెలుపుతున్న ఆశవర్కర్లు

వెల్దండ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశవర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 6 నెలల మెడికల్ సెలవులను ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినవిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్ సింధుకు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మంగమ్మ, ఆశావర్కర్లు యాదమ్మ, వసంత, యాదమ్మ, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం ఆశవర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వర్ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, నిర్మల, భీమమ్మ, శివలీల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణనకు అసెంబ్లీలో ఆమోదం తెలపడంతో శుక్రవారం మండల కేంద్రంలోని హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎర్రశ్రీనుముదిరాజ్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, నాయకులు కృష్ణ ముదిరాజ్, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్, పోలెరాజు, నారాయణ, వెంకట్‌నాయక్, తిరుపతిరెడ్డి, కృపానందం, పర్వతాలు, శంకర్, వినోద్, శ్రీనునాయక్, దశరథ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

సంతకాల సేకరణ

కల్వకుర్తి రూరల్: ఒకటే దేశం ఒకటే ఎన్నికలపై యువత చైతన్యం కావాలని స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఒకేసారి దేశమంతా ఎన్నికలు జరిగితే దేశాభివృద్ధి, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. దేశంలో ఏదో ఒకచోట ఎప్పుడు ఎన్నికల ప్రక్రియ ఉండడంతో అభివృద్ధి కుంటుపడుతోందని వివరించారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.



విత్తన బంతుల తయారీపై శిక్షణ



మన్ననూర్: అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా విత్తన బంతుల తయారీ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ ఎస్ బీ రాయ్ అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పరిసర ప్రాంతంలోని మల్లాపూర్ పెంటలోని చెంచులతో సమావేశమయ్యారు. అగ్ని రక్షణ, గ్లోబల్ వార్మింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. అమ్రాబాద్ ఎఫ్‌డీఓ రామ్మూర్తి, ఎఫ్ఆర్ఓ దేవజ, శ్వేత, ఎఫ్ఎస్ఓలు బాబలి, ముత్యాలు, బీఎఫ్ఓలు చెంచులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

తెలకపల్లి: రాష్ట్రస్థాయి పోటీలకు ఆలేరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరహరి, ఫిజికల్ డైరెక్టర్ బాలయ్య శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండలంలోని ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి, 6వ తరగతి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. కల్వకుర్తిలో నిర్వహించిన పోటీలలో బాలికల విభాగంలో 100, 400 మీటర్ల రన్నింగ్ పోటీలలో మధుప్రియ, బాలుర విభాగంలో డి రామ్ చరణ్ అండర్– 16 పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు దగ్గర రాష్ట్ర స్థాయి పోటీలలో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులకు అభినందన

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ చాంపియన్ పోటీలకు పట్టణంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం లోకేష్ 100 మీటర్ల రన్నింగ్ పోటీలకు, కిడ్స్ జావెలిన్ త్రోకు జి రామకృష్ణ, జావెలిన్ త్రోకు ఆర్ లోకేష్, టీ శేఖర్ 400 మీటర్ల పరుగుపోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. పోటీలను హైదరాబాద్‌లోని కొల్లూరులో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, పీటీ బాలసుబ్రమణ్యం అభినందించారు.


విజయోత్సవ ర్యాలీ

మన్ననూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదం తెలపడంతో శుక్రవారం ప్రశాంతినగర్ చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు వాయిద్యాలతో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, మందకృష్ణ మాదిగకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రశాంతి నగర్ గ్రామం నుంచి మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా నిర్వహించారు. పటాకులు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు భరత్, శివ, వెంకటయ్య, కృష్ణయ్య, సైదులు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన యాస్మిన్ ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలువలేదు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

డీహెచ్‌పీఎస్ బృందం పర్యటన



తాడూరు: మండలంలోని నాగదేవ్‌పల్లి, అంతారం, ఆకుల్లికుదురు, మేడిపూర్ గ్రామాల్లో శుక్రవారం దళితవాడల్లో డీహెచ్‌పీఎస్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా దళితుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులను దళితవాడల అభివృద్ధికి కేటాయించి, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, వెంకటయ్య, శ్రీశైలం, లక్ష్మయ్య, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలని ప్రార్థనలు

మన్ననూర్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ త్వరగా కోలుకోవాలని మన్ననూర్ మసీద్, నిరంజన్ షావలీ దర్గాలో ముస్లింలు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల మాజీ కో ఆప్షన్ సభ్యుడు రహీం, మసీదు కమిటీ పెద్ద నసీర్ సాబ్, ఇస్మాయిల్, మేరాజ్, అజ్జు, రెహమాన్, రవూఫ్, జహూర్, తదితరులు పాల్గొన్నారు.



‘రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయి’



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు లోపించాయని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో రోజురోజుకూ గొర్రెల చోరీలు పెరిగిపోతున్నాయని, చోరీలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల, కురుమల పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు. రూ.లక్షలు విలువ చేసే గొర్రెలు చోరీకి గురవుతుండగా బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినా పోలీసులు తీసుకోవడం లేదన్నారు. గొల్ల, కురుమల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు పోయిన గొర్రెలను రికవరీ చేసి బాధితులకు అందించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. గొర్రెలు చోరీకి గురికాకుండా పోలీస్ పెట్రోలింగ్ పెంచడంతోపాటు ప్రతిరోజు రాత్రి సమయంలో ఆటోలు, డీసీఎం, బొలెరో వాహనాలను తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలంయాదవ్, మాజీ సర్పంచ్ నాగన్న, తిరుమల్‌యాదవ్, తిరుపతయ్య యాదవ్, కుర్మయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

లింగాల: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ బాబయ్య, కేర్ టేకర్ పద్మ పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఫిర్యాదు

వెల్దండ: మండలంలోని షోషమ్మగడ్డతండాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డికి తండాకు చెందిన వడ్యావత్ చంద్యానాయక్ ఫిర్యాదు చేశారు.

ఇస్రో సెంటర్‌ను సందర్శించిన ఆర్ఐడీ విద్యార్థులు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్ఐడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. కలాం డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు చంద్రప్రకాష్, వీ.ప్రవీణ్‌లు ఇస్రో సెంటర్‌కు వెళ్లారు. వీరి వెంట పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు కుసుమలత ఉన్నారు. పర్యటనకు వెళ్లి వచ్చిన విద్యార్థులకు మండల విద్యాధికారి ఇమ్మానుయేల్ అభినందించారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



లింగాల: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో విద్యార్థులకు ప్రత్యేకంగా శుక్రవారం మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. అదే విధంగా అపార్ ఐడీని నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల అరెస్టు

వెల్దండ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తల అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న వారిని గుర్తించి శుక్రవారం తెల్లవారుజామున ముందస్తు పోలీసులు అరెస్టు చేశారు. అదే విధంగా విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తుగా వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, పీడీఎస్‌యూ నాయకులు తదితరులు ఉన్నారు.

మత్స్య కార్మికుల ముందస్తు అరెస్టు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర బడ్జెట్‌లో మత్స్య కార్మికులకు నిధులు కేటాయించక పోవడంతో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మత్స్య కార్మికులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డగోపుల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు బయ్య రాముడు, గ్రామ సంఘం అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి మల్లేష్, రాముడు, మశన్న, రవి, సి మల్లేష్ పాల్గొన్నారు.

పూచీకత్తుపై విడుదల

తాడూరు: మత్స్యకారులను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. నాయకులు శ్రీనివాసులు, శంకర్ తెలిపారు.

పోలీసుల అదుపులో..

బిజినేపల్లి: మత్స్యకారులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో శుక్రవారం ముందస్తుగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సంఘం నాయకులు తుమ్మల అల్లోజీ, మస్కూరి బంగారయ్య మాట్లాడుతూ మత్స్యకారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈర్ల భూపేష్, అంజి, భాషమోని ఆంజనేయులు, శివ, శ్రీశైలం ఉన్నారు.

బీసీ ఏ లోకి చేర్చాలి

కొల్లాపూర్: పట్టణంలో మత్స్యకార సంఘం నాయకులను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీసీ డీ గ్రూపు నుంచి బీసీ ఏ గ్రూపులో చేర్చాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో జలకం మద్దిలేటి, వురి సుధాకర్, పిట్టల సుధాకర్, రామయ్య, కురుమయ్య, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.